# మళ్ళీ వింటారా?

వాసిరెడ్డి సీతాదేవి

కరకర పొద్దు పొడిచింది.

పట్నంలో ఉన్న ఒకానొక సబ్ పోలీస్ స్టేషన్‌లో ఫోన్ మోగింది.

"హల్లో!"

.... .... ....

"హెడ్డును మాట్లాడుతున్నా!"

.... .... ....

"గుడ్ మానింగ్ సార్!" ఫోన్‌లో ఆఫీసరు కన్పించకపోయినా ఆఫీసరు ఎదురుగా నిల్చున్నట్టే తిన్నగా నిలబడి చెయ్యి కణతల దగ్గిరకు తీసుకెళ్ళి సెల్యూట్ చేశాడు.

"సాబ్ వస్తున్నారు సార్!" అంటూ హెడ్డు యస్. ఐ కి ఫోన్ అందిస్తూ, "సర్కిల్ బాబు" అన్నాడు.

"గుడ్ మాణింగ్ సర్! అలా? సర్! సర్! సర్: ఇప్పుడే వదిలేస్తాం!" ఫోన్ పెట్టేశాడు యస్. ఐ.

"నిన్న రాత్రి పట్టుకున్నవాణ్ణి తీసుకురా!"

హెడ్డు లాకప్‌లోనుంచి ఒకణ్ణి బయటికి తెచ్చారు.

వాడి మోకాళ్ళు వాచిఉన్నయ్. పాదాలు ఉబ్బి వేళ్ళ మధ్య రక్తం గడ్డకట్టి కన్పిస్తూంది. చేతులు వాచి ఉన్నయ్. నుదురు మీద బొప్పి ఉంది. వీపు నిటారుగా రావడం లేదు.

నడుంమీద దెబ్బలు తగిలిన పాములా వంకర టింకరగా నేలమీద పాకుతున్నట్టే వచ్చి నిలబడలేక మోకాళ్ళమీద చేతులు ఆనించి నిలబడ్డాడు.

"నకరాలు పోతవ్ బే! సీదా నిలబడ రాదురా!" అన్నాడు యస్. ఐ.

తిన్నగా నిల్చోబోయాడు. నడుం లేవ లేదు.

"అబ్బ!" అన్నాడు.

"పోరా! దొంగనాయాలా! పో! మళ్లీ పోకిరీ పనులు చేశావా...." కర్ర తిప్పుతూ అన్నాడు యస్. ఐ.

"నా డబ్బులు"

"ఏం డబ్బుల్రా! ఒరే హెడ్డూ వీడికి ఇంకా పొగరు దిగలేదురా!"

హెడ్డు దగ్గరకు వచ్చాడు.

"వాణ్ణి పట్టుకోకు. పోనియ్! పోరా! పోతావా? మరొకటి తగిలించాలా?"

రామచంద్రుడు వొళ్ళంతా వాచిపోయి నడవలేక నడుస్తున్నాడు. పెదాలు చిట్లి రక్తం గడ్డకట్టి ఉంది. నాలుకతో తడుపు కుంటూ బాధపు బిందాడుతున్నట్టే మూలుగుతూ పోచమ్మ టీ స్టాలుకు వచ్చి అల్లంత దూరంలో కుప్పలా కూలిపోయాడు.

పోచమ్మ పెనంమీద మినపట్లు వేస్తున్నది. ఆ పక్కన దడికల గుడిసెలో నలుగురైదుగురు బెంచీమీద కూర్చుని ఉన్నారు.

"ఆడెవడ్రా? రాముడులాగున్నాడు!" పోచమ్మ అట్లు తిరగేస్తూ అన్నది.

"అవునే అప్పోయ్! మీ ఊరినుంచి వచ్చిన ఆ రాముడే! ఏంటి అట్టా పడిపోయాడు."

"లెగండిరా! అణ్ణి ఎత్తుకు రండి. అట్టా సూత్తారేం!" అంటూ పోచమ్మ లేచి నులక మంచం వాల్చి, మురికి దుప్పటి పక్క వేసింది.

రామచంద్రుణ్ణి ఎక్కడ పట్టుకున్నా లబలబలాడిపోతున్నాడు. ఎలాగో మంచం కాడకు చేర్చారు.

"ఇదేందిరా నాయనా! ఈ దెబ్బలేంది? రాత్రి రాలేదేం? చుక్కేసుకోని తగాదాకు దిగావా?"

"లేదప్పా!" భోరుమన్నాడు రామచంద్రుడు.

"ముందు కాస్త చాయ్ఇయ్యవేఅప్పా!" అన్నాడు మాదయ్య,

అతికష్టంమీద కూర్చుని ఓకప్పు టీ తాగాడు.

"ఏందిరా? ఏమైంది? వొళ్ళంతా అట్టా మాంసం ముద్దలా ఎవరు కొట్టారు?

"ఇంకెవరు? పోలీసోళ్ళ దెబ్బలే అవి." అన్నాడు పోలీసు దెబ్బలు రుచితెలిసినపాత కేడీ రంగయ్య.

"నువ్వారుకోరా? అణ్ణి పోలీసోళ్ళు ఎందుకు కొట్టారు,ఆడికి నీలాంటి దొంగబుద్ధి లేదు." అన్నది పోచమ్మ.

"పోలీసోళ్ళు కొట్టాలంటే దొంగ తనం చెయ్యాలా ఏం?"

"అవునే అప్పా! పోలీసోళ్ళు రాత్రంతా నా ప్రాణం తీసేసినారు."

"ఆ!" నోరుతెరిచింది పోచమ్మ,

"అప్పా! నీకుదణ్ణం పెడతా. నన్నెంటనే మాఊరు పంపించెయ్యి. ఈపట్నంలో ఉండను. రాళ్ళు కొట్టుకొనే బతుకుతా. ఈళ్ళ దెబ్బకంటే ఆ కంట్రాక్టరు దెబ్బలే నయం, అన్నాడు రామచంద్రుడు కన్నీరు కారుస్తూ.

"ఒరే! అట్టా చూడకపోతేఏదన్నామందు పట్టుకొచ్చిరాయరాదురా!" అన్నదిపోచమ్మ

"డబ్బులియ్!"

పోచమ్మ కొంగు ముడి విప్పి నలిగిన రూపాయినోటు మాదయ్యకిచ్చింది.

"అసలేం జరిగిందిరా? పోలీసులు నిన్నెందుకు పట్టుకున్నారు?"

"అదే తెలవడం లేదు."


"అదేందిరా ఆసలు ఏంజరిగిందోచెప్పు. అన్నది పోచమ్మ అట్టు ముక్కలు తుంచి నోటికి అందిస్తూ.

రామచంద్రుడికి ఏంచెప్పాలో తెలియదు. తనను వాళ్ళు ఎట్లావేధించారో మాత్రం చెప్పాడు. మళ్ళీ ఎందుకు వదిలేశారో కూడా తెలియదన్నాడు.

"అప్పా! నాడబ్బులన్నీ తీసుకున్నారు. ఊరికి వెళ్ళడానికి_" దిగులుగా అన్నాడు.

"నేనిస్తాలేరా? అయినా ఉద్యోగానికి వచ్చావు గదరా?"

ఈ ఊళ్లో నాకు ఉద్యోగం వద్దు పాడూ వద్దు. నేను ఎల్లిపోతా!"



"పోదూగావిలే అసలు ఏం జరిగిందో చెప్పరా. ఏం జరక్కుంటే నిన్ను మాత్రం ఎందుకు పట్టు కొంటారు?" ఏదో జరిగే ఉంటుందనే అనుమానం వెళ్ళగక్కింది,

"నేను ఏం చెయ్యలేదంటుంటే?"

"ఏదో చేసే ఉంటావ్? చెప్పు." నిలదీసింది పోచమ్మ.

.... .... ....

అసలు ఏం జరిగిందంటే?

వినగలరా? వినకేం చేస్తారు? రోజూ వింటున్నదేగా?

రామచంద్రుడు పట్నం గురించి విన్నాడు. పట్నంలో ఉద్యోగం దొరుకుతుందని విన్నాడు. ఫ్యాక్టరీలో ఉద్యోగం సంపాదించాలని నాలుగు రోజుల నాడు

పట్నం వచ్చాడు. పోచమ్మ దుకాణంలో టీ తాగుతూ తన విషయం చెప్పాడు. పోచమ్మదీ ఆ వూరే. పదేళ్ళ క్రిందు భర్త పోయాక పొట్ట చేతో పట్టుకొని పట్నం చేరింది. రామ చంద్రుణ్ణి ఉద్యోగం వచ్చే దాకా తన దగ్గరే ఉండమన్నది.

రామచంద్రుడు ఆల్విన్ కంపెనీలో పని కోసం ప్రయత్నిస్తున్నాడు ఉదయం ఎనిమిది గంటలకి లేచి బయలుదేరాడు. పట్నం మొదటిసారిగా వచ్చాడు. అన్నీ వింతగా, కొత్తగానే కన్పిస్తున్నాయి అతనికి.

పెద పెద్ద బంగళాల ముందు నుంచి వెళుతున్నాడు. ఒక బంగళా ముందు వరండాలో చేతిలో చైను పట్టుకొని ఒక అంద మైన యువతి అల్‌సేషన్ డాగ్‌ని కవ్విస్తూ దాన్ని ఆడిస్తున్నది.

రామచంద్రుడికి కుక్కలంటే మహా ఇష్టం!

"భేష్షుగా ఉంది. ఏం జాతి! ఎంత హొగరుగా ఉంది!" అనుకుంటూ సర్వం మరచిపోయిన వాడిలా ఆ కుక్కనే చూస్తూ నిల్చుండిపోయాడు.

అలా ఎంతసేపు నిల్చున్నాడో అతనికే తెలియదు.

భుజం మీద ఒక బరువైన చెయ్యి పడింది. తృళ్ళిపడి చూశాడు. పోలీసు కానిస్టేబుల్‌ని చూసి నిలువునా వొణికి పోయాడు. వదిలించుకొని పారిపోవడానికి ప్రయత్నించాడు. మరొక పోలీసు కానిస్టేబుల్ రెండో వైపు నుంచి వచ్చాడు.

ఇద్దరూ ఎదురు తిరుగుతున్న వాడిని బూతులు తిడుతూ స్టేషన్‌కు లాక్కెళ్ళారు.

ఆ తిట్లలో వాళ్ళు రామచంద్రుడి అక్కనూ, అమ్మనూ కూడా లాగారు.

స్టేషన్‌కు వెళ్ళాక యస్. ఐ. కూడా అతని అంతస్తుకు తగిన భాషలో నానా తిట్లూ తిట్టాడు. లాకప్‌లోకి తోశారు.

ఆ తర్వాత రామచంద్రుడికి తనను ఎందుకు అలా లాక్కొచ్చారో లీలగా అర్థం అయింది.

తను చూస్తూ నిల్చున్న కుక్క — ఓ పెద్ద ఆఫీసరు గారిది. కుక్కను ఆడిస్తున్న యువతి ఆ ఆఫీసరు గారి ముద్దుల ఏకైక కూతురు.

ఆ అమ్మాయిని ఎవరో తుంటరి వారం రోజులుగా అల్లరి పెడుతున్నాడట. కాలేజి గేటు దగ్గర కాపలా కాస్తారట. ఇంటికి వచ్చాక సాయంత్రం పూట ఇంటిముందు తచ్చాడుతూ కన్పిస్తున్నాడట, ఆ విషయం ఆఫీసరుగారి కూతురు కవిత తండ్రితో చెప్పింది. ఆయన వెంటనే యస్. పి. కి ఫోను చేశాడు.

పెద్ద ఆఫీసరుగారి ఆజ్ఞ. రెండు రోజుల్లో అపరాధిని పట్టెయ్యాలని, అందరూ అల ర్టుగా రంగంలోకి దూకారు. రామచంద్రుణ్ణి పట్టారు. ఆ విషయం యస్. ఐ. యస్. పి. గారికి ఉత్సాహంగా చెప్పాడు, కాని వాడు అపరాధం ఒప్పుకోవడం లేదు. ఆ మాట యస్. పి. గారికి చెప్పలేదు. తెల్లవారి కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

ఆ రాత్రంతా రామచంద్రుణ్ణి ఒప్పించ డానికి పోలీసులు శాయశక్తులా ప్రయత్నించారు. ప్రతి దెబ్బకూ ఏడుస్తూనే తానేమీ చెయ్యలేదనీ, తను ఈ ఊరికి కొత్త అనీ చెబుతూనే ఉన్నాడు.

పోలీసులు బూతులు తిట్టూ "భాడ్కో! ఆ పిల్లనే వరనుకొన్నావురా? కూలి వెధవ్వి ఎంత ధైర్యం ఆ పిల్ల వెంట పడటానికి?"

"నాకు తెలియదు స్వామీ? నేను అట్లాంటి వాణ్ణి కాదు.?

"మాకు తెలుసురా! నువు గుండెలు తీసిన బంటువు. అమాయకంగా వేషం వేసు కొని ఆడపిల్ల రాకపోకల్ని గమనిస్తూ, రౌడీల సహాయంతో అదనుచూసి ఏ టాక్సీలోనో తీసుకెళ్ళి బ్రాతల్ హౌస్‌కు అమ్మేస్తారు. ఇంతవరకు ఎంతమంది ఆడ పిల్లల్ని లాడ్జీలకు చేరవేశావ్?

"నాకేం తెలియదు. నేను అట్లాంటి పన్లు చెయ్యను. మా అమ్మమీద వట్టు!"

"ఛీ!" అంటూ అతని అమ్మమీద ఒక బూతు విసిరాడు.

రామచంద్రుడు ఏడుస్తున్నాడు.

"ఈ కాగితంమీద సంతకం పెట్టు. నిన్ను వదిలేస్తాం,"

"ఏంటి బాబయ్యా అది?"

"అదే నీ తప్పును ఒప్పుకుంటూ మరెప్పుడు ఇట్లా చెయ్యనని." హెడ్డు చెప్పాడు.

దెబ్బలు భరించలేక వేలిముద్ర వెయ్య డానికి అంగీకరించాడు. తీరా వెయ్యబోతూ ఓ క్షణం ఆలోచించి వేలును నేలమీద రుద్దివేశాడు.

చదువుకోకపోయినా రామచంద్రుడు తెలి వైన యువకుడు. కొన్ని విషయాలు అతనికి తెలుసు. ముఖ్యంగా పోలీసువాళ్ళ గురించి అతని స్నేహితుడు నాగరాజు చెబుతూ ఉంటాడు— ఒక్కసారి తప్పు అంగికరిస్తే పాత కేడీల లిస్టులో వేసేస్తారు. పోలీసు వాళ్ళకు మనిషి కావాల్సి వచ్చినప్పుడల్లా ఒక పాతవాణ్ణి పట్టుకెళ్ళి వాడు చెయ్యని తప్పును అంగీకరించేలా చేస్తారు.

రామచంద్రుడు స్పష్టంగా తెలియక పోయినా ఒకసారి అపరాధం ఒప్పుకుంటే పోలీసుల దృష్టి ఎప్పటికీ తనమీద ఉంటుం దని తెలుసు.

ప్రాణం పోయినా ఒప్పుకోకూడదని నిర్ణయించుకున్నాడు.

రాత్రంతా దెబ్బలు తింటూనే ఉన్నాడు. మూగజంతువులా అరుస్తూనే ఉన్నాడు.

o o o o

రెండోరోజు ఉదయం సర్కిల్‌ను తీసు కొని యస్. పి. ఆఫీసరుగారింటికి వచ్చాడు. డ్రాయింగ్ రూంలో మాట్లాడుకుంటున్నారు. ఆఫీసరుగారు అంత త్వరగా అపరాధిని పట్టి నందుకు పోలీసు శాఖను అభినందించారు.

చిన్నగా సమయం చూసి తనకు డి.ఐ. జి. ప్రమోషన్‌డ్యూ అనీ, తనకంటే జూని యర్‌కు ప్రమోషన్ ఇచ్చారనీ విన్నవించు కున్నారు,

ఆఫీసరుగారు తలపంకించి "అది నాకువది లేయ్. నేను చూసుకుంటాను." అన్నారు.

"ఓ_డాడీ!" గావు కేక పెట్టింది కవిత.

"ఏమ్మా!" అంటూ లేచి వరండాలోకి వచ్చారు.

ఒకయువకుడు గేటు తీసుకొని లోపలకు వస్తున్నాడు. నీట్‌గా డ్రెస్‌చేసుకొనిఉన్నాడు. అందంగా ఉన్నాడు.

"అతనే డాడీ నావెంట పడేది. లోపలకే వచ్చేస్తున్నాడు." దాదాపు అరిచినట్టేఅన్నది.

అతను తలెత్తి చూశాడు.

ఎదురుగా యస్. పి. నీ, సర్కిల్‌నూ కవిత తండ్రినీ చూశాడు. అతను అలాగే గేటు పట్టుకొని నిల్చున్నాడు.

యస్. పి. సర్కిల్‌కు సైగ చేశాడు.

సర్కిల్ బులెట్‌లా వెళ్ళి ఆయువకుణ్ణి దొరకబుచ్చుకున్నాడు.

"ఏయ్! వదులు!" ఆ యువకుడు సర్కిల్‌ను ఒక తోపు తోశాడు. పడబోయి

విలదొక్కుకున్నాడు.

బూతు మాట పెదవుల వరకూవచ్చింది, కానీ వెనక యస్. పి. ఉన్నట్టు గుర్తొచ్చి ఆ మాటను మింగేశాడు సర్కిల్.

యస్. పి. ముందుకొచ్చి "యూ రాస్కెల్" అ చెంపా ఈ చెంపా వాయించాడు.

సర్కిల్ లాఠీ ఎత్తాడు.

యువకుడు ఓ క్షణం తెల్లబోయి నిల్చున్నాడు.

"ఆగండి!" అరిచింది కవిత.

"నన్ను కొట్టడానికి నేనెవరనుకున్నారు?" బుసలు కొట్టాడు యువకుడు.

"రా అంటావా?" అంటూ సర్కిల్ మళ్ళీ లాఠీ ఎత్తాడు.

"ఆగండి! అతను నా కాబోయే భర్త!" అన్నది కవిత.

"వాట్!" ఆఫీసరు అయోమయంగా అన్నాడు.

యస్. పి. తెల్లబోయి చూశాడు.

"మరి తమరు?" నీరుకారిపోయాడు సర్కిల్.

"నన్ను కొడ్తారా! మీ పని చెప్తాను. నేను ఎవర్నో తెలుసా?"

"అడిషనల్ ఐ. జి గారి అబ్బాయి ఆదిత్య." అన్నది కవిత.

"వ్వాట్!" అందరూ ఒకేసారి అన్నారు.

"రా బాబూ!" అంటూ చెయ్యి పట్టుకుని డ్రాయింగ్ రూమ్‌లోకి తీసుకెళ్ళి కూర్చోపెట్టాడు ఆఫీసరు.

యస్. పి. కి అర చేతుల్లో చెమట పట్టింది.

"సర్కిల్ వణికిపోతున్నాడు."

"క్షమించుబాబూ!" అన్నాడు యస్.పి.

"మీ తప్పేం లేదండి. అంతా నా తప్పే" అన్నది కవిత.

"ఎందుకలా చెప్పావ్?" విసుగ్గా అడిగాడు తండ్రి.

"చెప్పనా?" కొంటెగా ఆదిత్య కేసి చూస్తూ అన్నది కవిత.

ఆదిత్యకు ఇంకా కోపం తగ్గలేదు.

"అసలు ఇదంతా ఏమిటమ్మా!"

ఏం లేదు డాడీ మేమిద్దరం ప్రేమించుకున్నాం. రోజూ కాలేజీ వదిలే సమయానికి ఆదిత్య నా కోసం వస్తాడు. ఒక రోజు మాటల్లో పోలీసువాళ్ళు అసలు అపరాధుల్ని వదిలేసి ఎక్కువగా నిరపరాధుల్నే దండిస్తారన్నాను. ఆదిత్య పోలీసు ఆఫీసరు కొడుకు. వాళ్ళను వెనకేసుకొని వస్తాడు. ప్రజాసంఘాల విషయంలో కూడా పోలీసుల్ని అనవసరంగా నిందిస్తున్నారంటాడు. అందుకే ఈ నాటకం ఆడాము."

"చాలా గొప్ప పని చేశావ్?" అన్నాడు ఆదిత్య కోపంగా.

"క్షమించు ఆదీ! నాన్న కంప్లెయింటు ఇవ్వగానే ఒక అమాయకుణ్ణి పట్టేశారు. రాత్రంతా వాణ్ణి లాకప్‌లో ఉంచారు. ఈ పాటికి వాడి వళ్ళంతా హూనం అయి వుంటుంది. వాడు కేసు ఒప్పుకుంటే సరే! లేకపోతే వాడు మరో రోజు పోలీస్ లాకప్‌లోనే ఉంటే చచ్చిపోయినా ఆశ్చర్యం లేదు. ఇవ్వాళ ఉదయం నిన్ను అందుకే మా ఇంటికి రమ్మన్నాను."

ఆదిత్య ఆలోచిస్తూ ఉండిపోయాడు.


"క్షమించు బాబూ! పొరపాటయింది. నాన్నగారికి చెప్పకూ?" యస్. పి. అర్థిస్తూ ఆదిత్య రెండు చేతులూ పట్టుకున్నాడు.

"కవిత చెప్పింది నిజమేనా?"

"ఏమిటి బాబూ?"

"అదే! ఈ విషయంలో ఎవర్నో లాకప్‌లో పెట్టిన మాట."

యస్. పి. గొంతుకు పచ్చి వెలక్కాయ పడినట్టు అయింది.




"వెళ్ళి అతన్ని వెంటనే వదిలెయ్యమని ఫోన్ చెయ్యి" అన్నాడు సర్కిల్‌తో.

"యస్. సర్!" అంటూ సర్కిల్ ఫోన్ దగ్గిరకు వెళ్ళాడు.

కవిత ఆదిత్యను మేడమీదకు తన గదిలోకి తీసుకెళ్ళింది.

"మా అమ్మాయి మహా కొంటెపిల్ల!" గలగల నవ్వాడు ఆఫీసరు.

యస్. పి. కి నవ్వు రాలేదు. అయినా అతనితో శృతి కలిపాడు.

"వస్తా సర్!" లేచాడు యస్.పి.

"మంచిది."

"నా విషయం –" నీళ్ళు నములుతూ ఆఫీసరుకేసి చూశాడు.

"నేను చూసుకుంటాలే" భరోసా

.... .... .... ....

"ఎంతన్యాయం! ఎంతన్యాయం! అళ్ళ చేతులు ఇరిగిపోనూ!" పోచమ్మ గాయాలకు మందు రాస్తూ అన్నది.

బాణాలు గుచ్చుకున్న జంతువులా మూలుగుతున్నాడు రామచంద్రుడు.

o o o o

ఇలాంటివి జరుగుతూనే ఉన్నాయి.

మీకూ తెలుసు.

అయినా మరోసారి వినిపిస్తున్నాను!

మళ్ళీ వింటారనే కాదు–

ఈ విషయం గురించి అలో చిస్తారని

రోజూ వినేదే మళ్ళీ వినిపించాను. ✻